సాక్షి
ఆదిలాబాద్

ఆదివారం । 12 । ఫిబ్రవరి । 2023



సీజన్‌కు ముందే నకిలీ దందా

ఖరీఫ్ ముగియకముందే నకిలీ పత్తి విత్తనాల దందా మరూ అయింది. ఎవరికీ అనుమానం రాకుండా అక్రమార్కులు వీటిని రైతులకు అంటగట్టేందుకు తెరలేపారు. 8లో▸



పంచతత్వం.. ఆరోగ్యమంత్రం

పట్టణవాసులకు ఆహ్లాదకర వాతావరణంతో పాటు ఆరోగ్యం పంచేందుకు జిల్లాకేంద్రంలో మరో పార్కు అందుబాటులోకి రానుంది. 'పంచ తత్వ అక్యుప్రెషర్' సిద్ధమవుతతోంది. 9లో▸

గరిష్టం/కనిష్టం
36.0/16.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటిపూట ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. గాలిలో తేమ శాతం తగ్గనుంది.

న్యూస్‌రీల్

హమారా ప్రసాద్‌పై పీడీ యాక్టు నమోదు చేయాలి



ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌పై హమారా ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయనపై పీడీ యాక్టు నమోదు చేయాలని సమతా సైనిక్ దళ్ దక్షిణ భారతదేశ సంఘటకులు మార్షల్ వాగ్మారే దీపక్ అన్నారు. ఈమేరకు క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంబేద్కర్‌ను అవమానపరిచే వ్యక్తుల పై పీడీ యాక్ట్ పెట్టి దేశ ద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్పీని కలిసిన వారిలో రాష్ట్ర సంఘటకులు విశ్వ భూషణ్, రమాకాంత్, సత్యపాల్, హర్షవర్ధన్ వాఘ్మారే, కిశోర్, పోషెట్టి, గంగారాం పాల్గొన్నారు.

మే 17న పాలిసెట్

ఆదిలాబాద్‌అర్బన్: 2023–24 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం మే 17న పాలిసెట్ నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయ కర్త, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతి పూర్తి అయిన వారు, చదువుతున్న వారు అర్హులని పేర్కొన్నారు.

ఏప్రిల్ 12 నుంచి వార్షిక పరీక్షలు

కైలాస్‌నగర్: ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి ఒకటి నుంచి 9 తరగతుల వారికి వార్షిక (ఎస్ఏ–2) పరీక్షలు ఏప్రిల్ 12 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఈమేరకు పరీక్షల తేదీలను ఖరారు చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటాయని పేర్కొన్నారు.

రేపటి నుంచి రిమ్స్‌లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియలో భాగంగా ఇటీవల విద్యాశాఖ 317 జీవో కింద ఇతర జిల్లాల నుంచి జిల్లాకు వచ్చిన వారిని బదిలీ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈమేరకు సంబంధిత ఉపాధ్యాయులు రిమ్స్‌లో మెడికల్ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించుకోవాలని డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13,14 తేదీల్లో మెడికల్ బోర్డు అధికారులు అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పరీక్షలకు సన్నద్ధం కావాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఐఈవో

గుడిహత్నూర్: విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలని డీఐఈవో రవీందర్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ నెల 15 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు చేయాలని ప్రిన్సిపాల్ లెనిన్‌బాబుకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బోధన సిబ్బంది ఉన్నారు.

'షరతులతో హక్కు పత్రాలు ఇస్తామనడం విడ్డూరం'

ఆదిలాబాద్‌అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా సాగుచేస్తున్న 11.50 లక్షల ఎకరాల పోడు భూములకు షరతులతో కూడిన హక్కు పత్రాలు ఇస్తామనడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో అన్ని అబద్ధాలు మాట్లాడే ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కరేనని విమర్శించారు. పట్టణంలోని ఆయన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. అటవీ భూములు ఆదివాసీల జన్మ హక్కు అని, ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదన్నారు. పోడు భూముల సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ శుక్రవారం అసెంబ్లీ సాక్షిగా మరోసారి మోసపూరిత ప్రకటన చేశారని పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో షరతులతో కూడిన హక్కుపత్రాలు ఇస్తామనడం ఎంతవరకు సమంజసమన్నారు. ఆదివాసీలను అడవికి దూరం చేసే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



తాంసి మండలం కప్పర్లలో రైతు నిమ్మల రాజన్న ఇంట్లో నిల్వ చేసిన పత్తి

నిల్వని ఆశలు!



ఈ రైతు పేరు సొదారి భూమన్న. ఊరు తాంసి మండల కేంద్రం. గడిచిన వానాకాలంలో 11 ఎకరాలను రూ. లక్షా70 వేలకు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు.70 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పత్తి ధర ఓ దశలో 9 వేలు దాటినప్పటికి రూ.10 వేల వరకు పెరుగుతుందని భావించి ఇంట్లోనే నిల్వ చేశాడు. కారణం లేకపోలేదు. ఒక వేళ అనుకున్న ధర వస్తే తన మొత్తం పత్తికి రూ. 7 లక్షల వరకు వస్తాయనుకున్నాడు. దీంతో కౌలు పైసలు పోనూ తనకు ఎంతో కొంత ఆర్థిక ప్రయోజనం జరుగుతుందని ఆశించాడు. అనుకున్నది ఒకటైతే.. అయింది మరొకటి అన్నట్లు.. ప్రస్తుతం పత్తి ధర రూ. 7,550 పలుకుతుంది. ఈ లెక్కన తన మొత్తం పత్తిని అమ్మితే వచ్చేది రూ.5 లక్షల 28 వేలే. ఇప్పుడు ఆయన లెక్కలన్నీ తారుమారయ్యాయి. పంటను అమ్మాలో.. ఇంకా ఆగాలో అర్థం కావడం లేదంటున్నాడు సదరు రైతు.



ఇక్కడ కనిపిస్తున్న రైతు నితిన్ గవడ్. ఇచ్చోడ మండలం కోకస్‌మన్నూర్. రూ.70 వేలకు ఏడెకరాలు కౌలుకు తీసుకుని అందులో ఐదు ఎకరాల్లో పత్తి, రెండెకరాల్లో సోయా సాగు చేశాడు. పత్తి 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ధర పెరుగుతుందని భావించి ఇంట్లోనే నిల్వ చేశాడు. క్వింటాలు కూడా అమ్మలేదు. ఖర్చులకు ఇటీవల చేతికొచ్చిన రైతుబంధు నిధులు కొంత ఆసరా అయ్యాయి. అయితే తాజాగా పత్తి ధర రోజురోజుకు పడిపోతుంది. కనీసం మొదట్లో ఉన్న ధరైనా రాకపోదా అనే ఆశతో ఉన్నాడు ఈ రైతు.

- పరేషాన్‌లో పత్తిరైతు
- ధర పెరుగుతుందని ఇన్నాళ్లు పంట దిగుబడి నిల్వ
- ఒక్కసారిగా తగ్గిన రేటు
- రూ.పది వేలు కాదు.. రూ.8వేలు వచ్చినా చాలంటున్న రైతులు

సాక్షి,ఆదిలాబాద్: జిల్లాలో గత అక్టోబర్ 14న ఆదిలాబాద్ మార్కెట్‌లో పత్తి కొనుగోలు ప్రారంభమైంది. తొలిరోజు క్వింటాలుకు ప్రైవేటులో రూ.8,300 ధర పలికింది. ఆ తర్వాత ధరలో హెచ్చుతగ్గులు చోటు చేసుకున్నాయి. ఓ దశలో రూ.9వేల పైబడి కూడా వచ్చింది. శనివారం ధర 7,550 మాత్రమే. గతేడాది అనుభవం దృష్ట్యా మొదట్లో రైతులు రూ.10వేల వరకు ధర పెరుగుతుందని ఆశపడ్డారు. ఈ క్రమంలో దిగుబడి పూర్తి స్థాయిలో చేతికి వచ్చినా పంట విక్రయించకుండా ఎక్కువ మంది రైతులు ఇళ్లలోనే నిల్వ చేసుకున్నారు. ఇందులో చిన్న, సన్నకారుతో పాటు బడా రైతులూ ఉన్నారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా తారుమారైంది. ధర పెరగడం మాటేమోగానీ.. రోజు రోజుకు పడిపోతుంది. ఇది ఇప్పుడు నిల్వ చేసిన రైతులను ఆందోళనకు గురి చేస్తుంది. అయితే గతేడాది ఫిబ్రవరిలో పత్తి ధర రూ.10 వేల మార్క్‌ను చేరుకుంది. ఈ ఏడాది కూడా ఆ పరిస్థితి ఉండబోదా అనేదే రైతులో ఓ ఆశ.. అయితే ఆ పరిస్థితి ప్రస్తుతం కనబడటం లేదు.

అంతర్జాతీయంగా ఇదీ పరిస్థితి..

అంతర్జాతీయంగా పత్తి బేల్, సీడ్ ధరలకు అనుగుణంగా మార్కెట్‌లో హెచ్చుతగ్గులు చోటు చేసుకుంటున్నాయి. మొదట్లో బేల్ ధర రూ.71 వేలు పలికింది. అప్పుడు సీడ్ క్వింటాలుకు రూ.3,900 వరకు ఎగబాకింది. దీంతో మార్కెట్‌లో పత్తి ధర అప్పుడు ఆశాజనకంగా కనిపించింది. ప్రస్తుతం బేల్ ధర రూ.61 వేలకు చేరుకుంది. సీడ్ ధర రూ.3,600 ఉంది. ప్రధానంగా వాణిజ్యపంట అయిన పత్తికి సంబంధించి ఇతర దేశాలకు ఎగుమతి డిమాండ్ ఉంటే రేటు సహజంగానే అధికంగా వస్తుందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా సరైన పరిస్థితులు లేకపోవడం, ఆర్థిక మాంద్యం తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీంతోనే పత్తి ధరల పరిస్థితి ఇలా ఉందని చెబుతున్నారు.

జిల్లాలో పత్తి సాగు వివరాలు..
మొత్తం సాగు విస్తీర్ణం 4 లక్షల 11 వేల ఎకరాలు
దిగుబడి అంచనా 21 లక్షల నుంచి 25 లక్షల క్వింటాళ్ల వరకు
మద్దతు ధర రూ.6,380 (క్వింటాలుకు)
మార్కెట్ ధర రూ.7,550 (క్వింటాలుకు శనివారం)
ఇప్పటి వరకు మార్కెట్ వచ్చిన పత్తి 5 లక్షల 33 వేల క్వింటాళ్లు
గతేడాది ఇదే సమయానికి వచ్చిన పత్తి 8 లక్షల 70వేల క్వింటాళ్లు

పంట నిల్వకే మొగ్గు



పత్తి ధర పెరుగుతుందని రైతులు ఇప్పటి వరకు నిలవ్వకే మొగ్గు చూపుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి మార్కెట్‌లో తక్కువ కొనుగోళ్లు జరిగాయి. సరాసరిన ఇప్పటి వరకు అమ్మినదాంట్లో ఎక్కువ మంది రైతులకు రూ.8 వేల వరకు ధర వచ్చింది. – శ్రీనివాస్, డీఎంవో, ఆదిలాబాద్

ఆయిల్‌పామ్ సాగుకు చేయూత



నర్సరీలో పెరుగుతున్న ఆయిల్ పామ్ మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

- 'ఉపాధి'తో అనుసంధానం
- రైతుపై తగ్గనున్న కూలీల భారం
- ఈ యాసంగి నుంచి అమలు
- సాగు విస్తీర్ణం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

జిల్లాలో ఈ ఏడాది ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం 3,400 ఎకరాలు
ప్రస్తుతం జిల్లాలో సాగవుతున్న పంట 980 ఎకరాలు
మొక్కల కోసం డీడీలు చెల్లించిన రైతులు 1200
నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు 70,000
వచ్చే ఏడాది కోసం సిద్ధం చేస్తున్న మొక్కలు 3లక్షలు
మొక్కలను సిద్ధం చేస్తున్న నర్సరీ మదునాపూర్ (తలమడుగు)

కైలాస్‌నగర్: ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకోసం రైతులకు పలు సబ్సిడీలు అందించాలని నిర్ణయించింది. ఈ యాసంగి నుంచే అమలుకు శ్రీకారం చుట్టింది. మొక్కలు, బిందుసేద్యం పరికరాలపై రాయితీ అందిస్తున్నా గుంతలు తీయడం, మొక్కలు నాటడం, రవాణా తదితర పనులకు రైతులు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో జిల్లాలో ఆశించిన స్థాయిలో సాగుకు ముందుకు రావడం లేదు. ఈ క్రమంలో రైతులపై ఆర్థిక భారం తగ్గించాలనే ఉద్దేశంతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఆయిల్‌పామ్ సాగుకు అనుసంధానం చేయాలని కేంద్రం నిర్ణయించింది.

సాగుకు ముందుకొచ్చేలా ప్రోత్సాహం

ఒక్కో ఆయిల్ పామ్ మొక్కను గుంత తీసీ నాటేందుకు రూ.100 చొప్పున ఖర్చవుతుంది. ఈ లెక్కన ఎకరాకు 50గుంతలు వంతున రూ.5వేలు వెచ్చించాల్సి వస్తుంది. నర్సరీ నుంచి మొక్కల రవాణకు రూ.2,500, ఎరువులకు రూ.2వేలు ఖర్చవుతుంది. ఒక్కో మొక్క ధర రూ.193 ఉండగా, సబ్సిడీ పోనూ రైతు తన వాటాగా రూ.20 చెల్లించాల్సి వస్తోంది. ఈ లెక్కన మొక్కలకు రూ.1,000 ఖర్చవుతుంది. బిందు సేద్యం పరికరాలను సబ్సిడీపై ఇస్తున్నా జీఎస్టీని రైతులే భరించాల్సి రావడంతో మరో రూ.5వేలు, వాటిని బిగించేందుకు పంట పొలంలో తవ్వేందుకు రూ.2వేల చొప్పున చెల్లించాల్సి వస్తోంది. ఇలా ఈ పంట సాగు అధిక వ్యయం అవుతుండడంతో రైతులు అంతగా ఆసక్తి చూపడంలేదు. అలాగే మొక్క నాటిన నుంచి నాలుగేళ్ల వరకు ఆదాయం ఉండకపోవడంతో తక్కువ భూమి కలిగిన రైతులు అయిష్టత వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో రైతులకు ఆర్థిక చేయూతతో పాటు సాగు విస్తీర్ణం వీలైనంత పెంచాలని భావించిన కేంద్రం తాజాగా ఆయిల్‌పామ్ సాగుకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసింది.

వంద శాతం సబ్సిడీపై డ్రిప్

ఆయిల్ పామ్ సాగు చేసే ఐదెకరాల్లోపు ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందజేస్తోంది. అయితే జీఎస్టీ 12శాతం మాత్రం రైతులు చెల్లించాల్సి ఉంటుంది. బీసీ, జనరల్ రైతులకు 90శాతం రాయితీపై డ్రిప్ పరికరాలను అందజేస్తుండగా 12శాతం జీఎస్టీ, 10 శాతం డబ్బులను రైతులు చెలించాల్సి ఉంటుంది. ఐదు ఎకరాలపైన భూమి కలిగిన రైతులకు 80శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందజేస్తోంది. 12.5 ఎకరాల వరకు సబ్సిడీని వర్తింపజేస్తుంది.

సాగు భారం తగ్గించేలా

జిల్లాలో ఈ సీజన్‌లో 3,400 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకోసం తలమడుగు మండలం మదునాపూర్ గ్రామంలో నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నారు. ఈ సాగు నిమిత్తం గుంతలు తవ్వడం, మొక్కలు నాటడం, బిందు సేద్యం పరికరాలను బిగించేందుకు అవసరమైన కాలువలను తవ్వేందు కోసం ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేశారు. దీంతో రైతులపై ఆర్థిక భారం తగ్గనుంది. సాగు విస్తీర్ణం కూడా పెరగనుంది.

జాబ్‌కార్డు కలిగిన రైతులకు ప్రయోజనం



ఆయిల్ పామ్ సాగుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. గుంతలు తవ్వడం, మొక్కలు నాటడం, డ్రిప్ ఇరిగేషన్ పైపులను బిగించేందుకు తవ్వే కాలువల ఖర్చును ఉపాధి నిధుల నుంచి అందజేస్తాం. జాబ్‌కార్డు కలిగిన రైతులకు ఉపాధిని అనుసంధానం చేస్తున్నాం. సదరు రైతు కుటుంబీకులు ఈ పనులను చేసుకున్నట్లైతే పనులు నాణ్యతతో పాటు వారికి ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ఆసక్తి గల రైతులు పంట సాగు కోసం ఎంపీడీవోల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. – జి.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

ఎన్నికల హామీలను విస్మరించిన బీఆర్ఎస్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్



మాట్లాడుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్/ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను పూర్తిగా విస్మరించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని కేఆర్‌కే, శ్రీరామ్ కాలనీల్లో శనివారం ఏర్పాటు చేసిన శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్ కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆదిలాబాద్ మున్సిపల్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్ల నిధులను విడుదల చేస్తే, తూతూ మంత్రంగా కొన్ని పనులు చేసి మిగతా సొమ్మంతా నాయకులు తమ జేబుల్లో నింపుకున్నారని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మళ్లీ మాయమాటలతో ఓట్ల కోసం వచ్చే బీఆర్ఎస్ నాయకులను నిలదీయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, జోగు రవి, దినేష్ మటోలియా, ధోని జ్యోతి, బోయర్ విజయ్, మయూర్ చంద్ర, లాలామున్నా, సునంద రెడ్డి, సాయి కిరణ్, రాజేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి, తంతోలి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీకి రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సంతోష్, దయాకర్, మయూర్ చంద్ర, స్వామి, విజయ్, ధోని జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం..

జైనథ్: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఇందుకోసం ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పార్టీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. మండలంలోని తరోడ, నిరాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన శక్తి కేంద్రం కార్నర్ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాలు మోసపోయారన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్, నాయకులు కరుణాకర్‌రెడ్డి, చంద్రకాంత్, రాకేశ్‌రెడ్డి, గజానంద్ పాల్గొన్నారు.

రాజీమార్గంతోనే సత్వర పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత



కక్షిదారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత

ఆదిలాబాద్‌టౌన్: రాజీమార్గంతోనే కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకుంటే సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్ ద్వారా మొత్తం 1,590 కేసులు పరిష్కారమయ్యాయని పేర్కొన్నారు. ఇందులో తొమ్మిది సివిల్ కేసులు, 1,296 క్రిమినల్ కేసులు, బ్యాంకు లావాదేవీలకు సంబంధించి 285 కేసులు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలాజైన్, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మంజుల సూర్యవార్, అదనపు ఎస్పీ శ్రీనివాస్‌రావు, పీపీలు, న్యాయవాదులు ఈశ్వర్‌రెడ్డి, కిరణ్ కుమార్, సంజయ్ వైరాగ్రే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, తదితరులున్నారు.

ట్రాక్.. ఆర్టీసీ!

- అరచేతిలో బస్సుల వివరాలు
- యాప్‌లో పూర్తి సమాచారం
- హైదరాబాద్‌కు వెళ్లే వాటికే తొలుత అమలు



మంచిర్యాలఅర్బన్: రైలు ఎక్కడుందో.. మన స్టేషన్‌కు రావడానికి ఎంత సమయం పడుతుందో తెలుసుకునేందుకు ఇండియన్ రైల్వే పలు యాప్‌లను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో రైళ్లకు సంబంధించిన సమగ్ర సమాచారం ఉంటుంది. అచ్చం ఇలాంటి పరిజ్ఞానాన్ని, సాంకేతికతను తాజాగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కూడా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆర్టీసీ బస్సుల సమయం.. ఎక్కడి నుంచి వస్తుంది.. ఎంతో సేపట్లో బస్టాండ్‌కు చేరుకుంటుందో ప్రయాణికులు తెలుసుకునేలా ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ట్రాకింగ్ సిస్టమ్ అందుబాటులోకి రావడంతో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు.. బస్సుల రాకపోకల సమాచారం ప్రయాణికులు ఇట్టే తెలుసుకునే వీలు కలుగుతుంది.

వాహన ట్రాకింగ్‌తో...

బస్సు ఏ ఊరు దాటుకుని వచ్చింది.. ఏస్టేజీలో ఉంది.. అక్కడ ఎంత సేపు ఆగింది.. గమ్యస్థానానికి ఎన్ని గంటలకు చేరుకుంటుంది.. ఎన్ని కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది.. ఇలాంటి వివరాలు ట్రాకింగ్ ద్వారా తెలుసుకోవచ్చు. బస్సు ఏదైనా కారణంతో నిలిచిపోతే.. ఎక్కడ ఆగింది.. ఎంత సేపు ఆగింది అనే వివరాలతో పాటు సమస్య వచ్చి ఆగిందా.? డ్రైవర్ స్టేజీ వద్ద బస్సు నిలిపాడా.. అనే విషయాలు తెలుసుకునే వీలుంటుంది. బస్సు సంఖ్య, లేక సర్వీస్ నంబర్ తెలిస్తే ఆ బస్సు సమగ్ర సమాచారం సెల్‌ఫోన్‌లో పొందవచ్చు. అయితే ఈ పరిజ్ఞానాన్ని మొదట దూరప్రాంతాలైన హైదరాబాద్, భద్రాచలం, తిరుపతి, బెంగళూరు, షిర్డీ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమాచారం మాత్రమే అందుబాటులోకి వచ్చింది.

యాప్ పనితీరు ఇలా..

స్మార్ట్‌ఫోన్‌లో ప్లేస్టోర్‌లోకి వెళ్లి టీఎస్ఆర్టీసీ ట్రాకింగ్ యాప్ అని టైప్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌లోకి వెళ్లి బస్సు నిలుపు గమ్యాలు, దగ్గరగా స్టేజీలు, ఆయా ప్రాంతాల వివరాలు కనిపిస్తాయి. యాప్‌లో హైదరాబాద్ సిటీ కాకుండా డిస్ట్రిక్ట్ అనేదానిపై క్లిక్ చేసి బస్సు నంబర్, సర్వీసు నంబర్ నమోదు చేస్తే వివరాలు తెలుస్తాయి. ఇదే యాప్‌లో ప్రయాణికుడు రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం కూడా ఉంది. సెర్చ్‌ఫర్ బస్‌స్టాప్స్ ఆప్షన్‌లో ప్రయాణికుడు ప్రయాణం చేస్తూ ఏదైనా బస్టాప్ కావాలంటే ఆ స్టాప్ పేరు నమోదు చేసి ఎంత దూరంలో ఉందో కూడా తెలుసుకోవచ్చు. సెర్చ్‌ఫర్ బస్ బిట్వీన్, ట్రాక్‌బస్‌బై సర్వీసు నంబర్, సెర్చ్ బై బస్ నంబర్, రిజర్వేషన్ బుక్ టికెట్‌లో టికెట్ బుక్ చేసుకోవచ్చు. ఎమర్జెన్సీ సేవలనూ ఇందులో పొందుపర్చారు. అత్యవసర సమయంలో బస్సు మార్గమధ్యంలో ఆగినా, ఏదైనా ప్రమాదం జరిగినా ఈయాప్‌తో సమాచారాన్ని పోలీస్ అగ్నిమాపకం, 108కు అందించవచ్చు. బస్సుకు కేటాయించిన సమయం కన్నా ముందు వచ్చినా.. ఆలస్యంగా వచ్చినా అనుమతిలేని ప్రదేశాల్లో నిలిపినా యాప్ చూపిస్తుంది.

ప్రయాణికులకు ఉపయోగం..

హైదరాబాద్ రూట్లలో బస్సుల్లో ట్రాకింగ్ సిస్టం అమల్లోకి వచ్చింది. ప్రయాణికులకు సమాచారం తెలుసుకోవటం సులువుగా ఉంటుంది. 15 రోజుల క్రితం టీఎస్ ఆర్టీసీ బస్ ట్రాకింగ్‌యాప్ అందుబాటులోకి తెచ్చింది. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి – రవీంద్రనాథ్, మంచిర్యాల డీఎం

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని గుండంలొద్దీ గ్రామానికి చెందిన బాల్‌రావ్ (21) శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. 108 ఈఎంటీ కార్తీక్‌సింగ్, పైలెట్ గజానన్‌లు సంఘటన స్థలంలో ప్రథమ చికిత్స చేసి జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. యువకుడి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ విషయంపై ఎస్సై నాగనాథ్‌ను సంప్రదించగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అథ్లెటిక్స్‌లో జాతర్ల విద్యార్థి



మడవి సోముతో స్పోర్ట్స్ కోచ్ లక్ష్మీరామ్

బజార్‌హత్నూర్: బీహార్ రాష్ట్రంలోని పట్నాలో జరిగిన నేషనల్ లెవల్ అథ్లెటిక్స్ (ఎన్‌ఐడీజేఏఎం) క్రీడా పోటీల్లో ట్రాక్లింగ్ జంప్ విభాగంలో మండలంలోని జాతర్ల మోడల్ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థి మడవి సోము ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండో స్థానంలో నిలిచాడు. సిల్వర్ మెడల్ సాధించిన మడవి సోమును బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ ఫోన్‌లో అభినందించారు. సోము ఉన్నతికి ఆర్థిక సాయం అందించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడి మృతి

ఎదులాపురం: పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్ వివరాల ప్రకారం ... మహారాష్ట్ర కిన్వట్ తాలుకా తలాయిగూడకు చెందిన మల్గం సునీల్ (21) ఏ పని చేయకుండా జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. దీంతో తండ్రి లక్ష్మణ్ ఈ నెల 6న సునీల్‌ను మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన సునీల్ మద్యం మత్తులో పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. కోలుకున్న సునీల్‌ను శనివారం ఉదయం డిచ్ఛార్జ్ చేశారు. ఇంటికి రాగా శ్వాససరిగ్గా ఆడకపోవడంతో తిరిగి చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపాడు.

నిందితుడిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

కడెం: భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమర ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు భుక్య కిషన్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రసాద్‌ను వెంటనే అరెస్ట్ చేసి అతడిపై పీడీ యాక్ట్ కేసు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్‌నాయక్, ఆర్ల రమేష్ ఉన్నారు.

ఆత్మహత్యలకు అడ్డాగా బాసర



ఈ ఫొటోలో విగతజీవులుగా కనిపిస్తున్న వారు బాలాదిత్య, భవ్యశ్రీ, తల్లి మానస. నిజామాబాద్‌లో చదువుకుంటున్న చిన్నారులు జనవరి 23న తల్లితో కలిసి బాసర వచ్చారు. షాపింగ్‌మాల్‌లో పనిచేసే మానస ఇద్దరు పిల్లలను బడి నుంచి గుడికి వెళ్దామని తీసుకొచ్చింది. ప్రశాంతంగా వచ్చిన పిల్లలు నదితీరంలో అందరిని చూసి ఆనందపడ్డారు. మహానదిలో పుణ్యస్నానం ఆచరించి అమ్మవారిని దర్శించుకుందామనుకున్నారు. స్కూల్‌కు తీసుకువెళ్లిన టిఫిన్ బాక్సులను నది ఒడ్డున కడుపారతిన్నారు. అంతలోపే జన్మనిచ్చిన కన్నతల్లే పిల్లలను తీసుకువెళ్లి నదిలోకి తోసి తాను సైతం దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మానస భర్త మూడేళ్ల క్రితమే చనిపోయాడు. మహబూబ్‌నగర్ జిల్లా కోజ్గి గ్రామానికి చెందిన మానస అప్పటి నుంచి నిజామాబాద్‌కు వచ్చి ఓ షాపింగ్‌మాల్‌లో పనిచేస్తూ జీవిస్తోంది. భర్తలేని లోటు, ఆర్థిక కష్టాలతో మానసికంగా కుంగిపోయిన గోదావరి నదిలో ఆత్మహత్యకు పాల్పడింది. అభం శుభం తెలియని పిల్లలను నదిలో తోసేసింది. ఇలా బాసర గోదావరిలో పలు కారణాలతో దూకి ఆత్మహత్యకు పాల్పడేవారి సంఖ్య పెరుగుతోంది. – భైంసా



బాసర వద్ద గోదావరి నది

సంవత్సరం	ఆత్మహత్యలు
2015	06
2016	05
2017	04
2018	05
2019	08
2020	08
2021	09
2022	09
2023	03

కౌన్సెలింగ్ ఇస్తున్నాం

క్షణికావేశంలో బాసరకు వచ్చి ఆత్మహత్యకు పాల్పడేవారు కనిపిస్తే వారిని స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. విధుల్లో ఉండే సిబ్బంది ఇది వరకు ఎంతో మందిని గుర్తించారు. క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడవద్దు. సమస్యలు ఉంటే ధైర్యంగా ఎదుర్కొవాలి. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయం కుటుంబాలకు ఏ దిక్కులేకుండా చేస్తోంది.

– మహేశ్, ఎస్సై బాసర

- ఏ ఆపద వచ్చినా నదిలో దూకేస్తున్నారు
- కనిపించని భద్రత సిబ్బంది
- రెస్క్యూ టీం ఏర్పాటు చేయాలని స్థానికుల వినతి

ఇబ్బంది ఉన్నప్పటికీ..

వసంత పంచమి సందర్భంగా బాసర గోదావరి నది తీరం వద్ద వందలాది సిబ్బంది పనులుచేస్తున్నారు. ఆలయ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బంది అక్కడే ఉన్నారు. కానీ సోమవారం తల్లితోపాటు ఇద్దరు పిల్లలు గోదావరి దూకి ఆత్మహత్యకు పాల్పడుతున్న సమయంలో ఏ ఒక్కరూ గుర్తించలేకపోయారు. అక్కడ పనిచేసే సిబ్బంది అప్రమత్తమైతే ఆ ముగ్గురి ప్రాణాలు కాపాడేవారు.

భద్రత కరువు...

బాసర గోదావరి నదిలో ఆత్మహత్యలు పెరుగుతూనే ఉన్నాయి. బాసర వంతెన నుంచి స్నానఘట్టాల వరకు ఉన్న మార్గంలో చాలా మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గోదావరి ఒడ్డుకు వచ్చిన చాలా మంది కుటుంబ సమస్యలతో, ఇతర ఇబ్బందులతో తనువు చాలిస్తున్నారు. ఇటీవల కాలంలో బాసరకు వచ్చి నది నీటిలో దూకి తనువు చాలించే వారి సంఖ్య పెరుగుతోంది. ఎంతో మంది ప్రాణాలు కొల్పోతున్నా భద్రత చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు.

రక్షణ చర్యలు కరువు...

గోదావరి నది వద్ద రక్షణ చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. నదిలో రెస్క్యూటీం ఏర్పాటు చేసి నిత్యం పర్యవేక్షించాలి. నిజామాబాద్ జిల్లా యంచ గ్రామస్తులు గోదావరి నది వద్ద ఎత్తైన గోడ నిర్మించాలని మంత్రి ప్రశాంత్‌రెడ్డికి ఇటీవలే వినతిపత్రం ఇచ్చారు. బాసర వద్ద వేలాది మంది భక్తులు నిత్యం పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ప్రమాదవశాత్తు జారిపడినా, ఆత్మహత్యలకు పాల్పడాలనే ఆలోచనలో ఉన్న వ్యక్తులను రెస్క్యూటీం ఎప్పటికప్పుడు పర్యవేక్షించి కాపాడాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

20న ఐటీడీఏ కార్యాలయం ముట్టడి

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న ఐటీడీఏ ఉట్నూర్ ముట్టడి కార్యక్రమం చేపట్టినట్లు ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్ అన్నారు. శనివారం సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు బుర్సా పోచయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర కమిటీ సూచనతో ఈ ముట్టడి చేపడుతున్నామన్నారు. చట్టబద్ధతలేని లంబాడీలను ఎస్టీ జాబిత నుంచి తొలగించే వరకూ ఉద్యమిస్తామన్నారు. ఇతర కులాలను ఎస్టీ జాబితాలో కలుపవద్దని, ఆదివాసీలు సాగుచేస్తున్న అటవీ భూములకు ఎలాంటి షరతులు, తీర్మానాలు లేకుండా హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేసా, 1/59, 1/70 చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. 5వ షెడ్యూల్ ప్రాంతంలో ప్రభుత్వ 29 శాఖల్లోని జీవోలను అమలు చేయాలని, గిరివికాసం పథకం కింద ఆదివాసీ రైతుల వ్యవసాయ పొలాల్లో బోరు బావులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా, మండల కేంద్రాల్లో నివాసం ఉంటున్న ఆదివాసీలకు ఇంటి స్థలాలు వెంటనే మంజూరు చేయాలన్నారు. జీవో ఎంఎస్ 3ని యథావిధిగా అమలు చేయాలని, గిరిజన యూనివర్సిటీని ఆదిలాబాద్ జిల్లాలోనే ఏర్పాటు చేయాలని, జీవో ఎంఎస్ 317ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్పెషల్ డీఎస్సీ వేసి ఆదివాసీ యువతి, యువకులకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలన్నారు. నాన్ ఏజెన్సీ ఆదివాసీ గ్రామాలను ఏజెన్సీ గ్రామలుగా గుర్తించాలని కోరారు. దళితబంధు మాదిరిగానే ఆదివాసీలకు ఆదివాసీ బంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తదితర డిమాండ్లతో చేపడుతున్న ఐటీడీఏ ముట్టడికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కమిటీ సభ్యులతో పాటు మండలంలోని అన్ని సంఘాలు, ఆదివాసీ నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎగ్గాం సబ్‌స్టేషన్ ఆపరేటర్ సస్పెండ్

భైంసాటౌన్(ముథోల్): నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని ఎగ్గాం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న సుధాకర్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న రాత్రి విధుల్లో ఉన్న సుధాకర్ మద్యం సేవించినట్లు స్థానికుల సమాచారంతో వెళ్లి పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం స్థానిక ఏరియా ఆస్పత్రిలో పరీక్షలు చేయించగా మద్యం సేవించినట్లు తేలిందన్నారు. ఈ మేరకు అతన్ని సస్పెండ్ చేసినట్లు డీఈఈ పేర్కొన్నారు.

మాజీ మావోయిస్టు ఆత్మహత్య

కోటపల్లి: మండలంలోని బోప్పారం గ్రా మానికి చెందిన మా వోయిస్టు పార్టీ మాజీ డిప్యూటీ దళ కమాండర్ కనకాల సమ్మయ్య(52) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బోప్పారం గ్రా మానికి చెందిన కనకాల సమ్మయ్య మావో యిస్టులో వివిధ హోదాలో పనిచేయగా 20ఏళ్ల క్రితం సమ్మయ్యతో పాటు అతడి భార్య స మ్మక్కను పోలీసులు అరెస్టు చేశారు. విడుద ల అనంతరం భువనగిరి జిల్లాలోని మోటుకుంటలోని వ్యవసాయ క్షేత్రంలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సమ్మయ్య శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం మండలంలోని బొప్పారం గ్రామానికి తీసుకొచ్చారు. సమ్మయ్యకు ఇద్దరు పిల్లలున్నారు.



సమ్మయ్య(ఫైల్)

తుమ్మల దేవరావ్‌కు 'గుర్రం జాషువా' పురస్కారం

నిర్మల్‌చైన్‌గేట్: విమలశాంతి, పాలపిట్ట సంయుక్తంగా నిర్వహించిన గుర్రం జాషువా సాహితీ కవితా పురస్కారాన్ని నిర్మల్‌కు చెందిన ప్రముఖ కవి తుమ్మల దేవరావ్‌కు శనివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో అందజేశారు. ఆయన రచించిన 'పొద్దున' కవితకు ఈ పురస్కారం లభించింది. ఆచార్య కొలుకలూరి ఇనాక్, నిఖిలేశ్వర్, ప్రొఫెసర్ జీవి రత్నాకర్, బిక్కి కృష్ణ, కోయికొటేశ్వర్ రావ్, డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, విమలశాంతి సంస్థ వ్యవస్థాపకులు జల్ది విద్యాధర్‌రావు ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా కవులు డాక్టర్ దామెర రాములు, డాక్టర్ చక్రధారి, పత్తిశివ ప్రసాద్, నెరేళ్ల హన్మంతు, అబ్బడి రాజేశ్వర్ రెడ్డి అభినందించారు.



అవార్డు స్వీకరిస్తున్న తుమ్మల దేవరావ్

అమరప్రసాద్‌పై పీడీయాక్ట్ నమోదు చేయాలి

నిర్మల్‌టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమర ప్రసాద్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయాలని అఖిల భారత ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం సభ్యులు కోరారు. జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ప్రసాద్‌పై సీఐ మల్లేశ్‌కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమర ప్రసాద్‌పై కఠినంగా కేసులు నమోదు చేసి ఇంకోసారి ఇలాంటి వ్యాఖ్యలకు ఏ ఒక్కరు కూడా పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.రాములు, ప్రధాన కార్యదర్శి పరమేశ్వర్, ప్రభాకర్, అశోక్, లింగన్న, మొహినోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



సీఐకి ఫిర్యాదు పత్రం అందిస్తున్న సభ్యులు

ఆదివాసీలపై కేసీఆర్ వ్యాఖ్యలు సరికాదు

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివాసీలకు పోడు హక్కు లేదని, వారు అక్రమణదారులని అనడం సరికాదని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సిడాం జంగుదేవు అన్నారు. మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ ప్రాంగణంలో వారు మాట్లాడారు. ఆదివాసీ విద్యార్థుల విద్యాభివృద్ధికి ట్రైబల్ యూనివర్శిటీ నెలకొల్పకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఆదివాసీ షెడ్యూల్ 5చట్టాలను తుంగలో తొక్కుతూ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలు డిక్లరేషన్ రాసి ఇవ్వాలనడం సరికాదన్నారు. కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వమే అడవి ప్రాంతాల్లో ఓపెన్ కాస్ట్ గనులు తెరిపిస్తూ అడవి అక్రమణకు పాల్పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు దీపక్, త్రిమూర్తి, జగన్ మోహన్, శ్రీకాంత్, అనీల్, సంతోశ్, శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిడాం జంగుదేవ్

సీజన్‌కు ముందే నకిలీ దందా

- రూ.10లక్షల విలువచేసే పత్తివిత్తనాలు స్వాధీనం
- ఖరీఫ్ ముగియకముందే దందాకు తెర
- తాండూర్, భీమిని మండలాలే కేంద్రంగా..
- కాసులు కురిపిస్తున్న అక్రమదందా
- కొరవడిన పూర్తిస్థాయి నిఘా



తాండూర్: నకిలీ పత్తి విత్తనాలతో పట్టుబడిన నిందితులు (కింద కూర్చున్న వ్యక్తులు)

బెల్లంపల్లి: ఖరీఫ్ పత్తి సీజన్ ముగియక ముందే జిల్లాలో నకిలీ పత్తివిత్తనాల దందా ప్రారంభమైంది. ఎవరికీ అనుమానం రాకుండా ముందస్తు వ్యూహంతో కొందరు నకిలీ పత్తి విత్తనాల దందాకు తెర తీశారు. గుట్టుగా రైతులకు నకిలీ పత్తి విత్తనాలు అంటగట్టడానికి చేసిన యత్నాలను ముందస్తు చర్యలతో పోలీసులు రట్టు చేశారు. ఇంకా ఆఖరు దశ పత్తి సేకరణ జరగాల్సి ఉండగా, మద్దతు ధర లేక ఈపాటికే సేకరించిన పత్తిని మార్కెట్‌కు తీసుకువెళ్లక రైతులు ఇళ్లలో నిల్వ ఉంచారు. ఇదే క్రమంలో అక్రమార్కులు నకిలీ పత్తి విత్తనాల సరఫరాకు రంగం సిద్ధం చేసుకోవడం వెనుక పెద్ద ఎత్తున వ్యూహం పన్నినట్లుగా తెలుస్తోంది. శనివారం తాండూర్ మండలం బోయపల్లి బోర్డు వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు మాటు వేసి నకిలీ పత్తి విత్తనాలు రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను పట్టుకోగా మరో ఇద్దరు పారిపోయారు. ఈ ఘటనలో పోలీసులు రూ.10 లక్షల విలువ చేసే నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. బొలేరో వాహనం, కారును సీజ్ చేశారు.

తాండూర్, భీమిని మండలాలు కేంద్రంగా...

నకిలీ పత్తి విత్తనాల క్రయవిక్రయాలకు తాండూర్, భీమిని మండలాలు ప్రధాన అడ్డాలుగా మారినట్లు తెలుస్తోంది. గతంలో సైతం ఆయా మండలాల నుంచే రైతులకు నకిలీ విత్తనాలను సరఫరా చేసినట్లు ప్రచారం జరిగింది. రహస్య ప్రాంతాల్లో నిల్వ ఉంచి నమ్మకమైన వ్యక్తుల ద్వారా రైతులకు పత్తి విత్తనాలను చేర వేసి దందాను లాభసాటిగా చేసుకున్నారు. సీజన్ ప్రారంభంలో పోలీసు నిఘా ఉంటుందనే ఉద్దేశంతో ఈసారి పత్తి సీజన్ నడుస్తున్న క్రమంలోనే నకిలీ విత్తనాలను దిగుమతి చేసుకున్నట్లుగా తెలుస్తోంది. రహస్య ప్రాంతాల్లో విత్తనాలను భద్రపర్చి మంచిర్యాల ప్రాంత రైతాంగానికి సరఫరా చేసే క్రమంలో అనూహ్యంగా పోలీసులకు చిక్కినట్లుగా తెలుస్తోంది.

ఏ ప్రాంతం నుండి వచ్చాయో ...

నకిలీ పత్తి విత్తనాలు గుట్టుగా రహస్య ప్రాంతాలకు చేరుకోవడం విస్మయం కలిగిస్తోంది. అయితే ఈ విత్తనాలు ఏ ప్రాంతం నుంచి వచ్చాయో తెలియాల్సి ఉంది. రహస్య స్థావరం నుంచి వేరే మరో ప్రాంతానికి వాహనాల్లో రవాణా చేస్తూ పోలీసులకు చిక్కడం సర్వత్రా చర్చనీయాంశమైంది. నిషేధిత పత్తి విత్తనాలను అక్రమార్కులు మహారాష్ట్ర వైపు నుంచి తీసుకు వచ్చారా లేదా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్నారా అనేది తేలాల్సి ఉంది. అక్రమార్కులను అరెస్టు చేసి సమగ్రంగా విచారణ చేస్తే కానీ పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశాలు కానరావడం లేదు. నిత్యం నిఘా ఉన్నా కూడా అక్రమార్కులు దర్జాగా నకిలీ విత్తనాలను దిగుమతి చేసుకుని రహస్య స్థావరం నుంచి మరో ప్రాంతానికి రవాణా చేయడానికి సిద్ధపడడం సాధారణ విషయం కాదంటున్నారు పలువురు.

తిలాపాపం తలాపిడికెడు...

ప్రభుత్వ నిషేధిత పత్తి విత్తనాల క్రయ విక్రయాలు చేయడం నేరం. కానీ ఈ దందా అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. నకిలీ దందాను అరికట్టాల్సిన కొందరు అధికారులు అక్రమార్కులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలను కొంత కాలం నుండి మూటగట్టుకుంటున్నారు. ఒకరిద్దరు అధికారులు వ్యవహరిస్తున్న తీరు మరింత అనుమానాలను రేకెత్తిస్తోంది. అడపాదడపా నకిలీ విత్తనాలు పట్టుకుని ఉన్నతాధికారులకు అనుమానాలు కలుగకుండా చాకచక్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తంగా పరిశీలిస్తే కొందరు అధికారుల లోపాయికారీ తనం అక్రమార్కులకు కలిసి వస్తున్నట్లుగా తెలుస్తోంది. ఏటా నకిలీ దందా నిరాటంకంగా సాగుతుండడం ఇందుకు నిదర్శనం అంటున్నారు పలువురు రైతులు.

పత్తి విత్తనాలు పట్టివేత

- టాస్క్‌ఫోర్స్ పోలీసుల తనిఖీల్లో గుర్తింపు
- మంచిర్యాల జిల్లా తాండూర్‌లో ఘటన

తాండూర్(బెల్లంపల్లి): ప్రభుత్వం నిషేధించిన బీటీ-3 పత్తి విత్తనాలను బెల్లంపల్లి టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. తాండూర్ మండలం బోయపల్లి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నకిలీ విత్తనాలు పట్టుబడ్డాయి. టాస్క్‌ఫోర్స్ సీఐ అశోక్ కథనం ప్రకారం.. తాండూర్ గ్రామ శివారు ప్రాంతం నుంచి కొంతమంది వాహనాల్లో నిషేధిత బీటీ-3 పత్తి విత్తనాలు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు పక్కా సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన టాస్క్‌ఫోర్స్ పోలీసులు బోయపల్లి వద్ద మాటు వేశారు. అనుమానాస్పదంగా కనిపించిన బొలేరో, కారును ఆపి తనిఖీ చేశారు. ఈ వాహనాల్లో 5 క్వింటాలక్ల నిషేధిత పత్తి విత్తనాలు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు పారిపోయారు. నిషేధిత విత్తనాల విలువ రూ.10 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. అదుపులోకి తీసుకున్నవారు శ్రీరా ముల నవీన్ (రేచిని గ్రామం, తాండూర్ మండలం), ఒడ్నాల రాకేశ్(కొమురవెల్లి, రెబ్బెన మండలం), మోర్ల వెంకటస్వామి (భీమిని) అని తెలిపారు. కొడిపాక రంజిత్‌కుమార్, గాండ్ల మహేశ్(రేచిని గ్రామం, తాండూర్ మండలం) చాకచక్యంగా తప్పించుకున్నారు. నకిలీ పత్తి విత్తనాల రవాణాకు వినియోగించిన బొలేరో, కారు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. నిందితులు ఎవరికీ అనుమానం రాకుండా వాహనాల్లో వడ్ల బస్తాలు ఉంచి అడుగున నిషేధిత పత్తి విత్తనాలను తరలిస్తున్నారని తెలిపారు.

అధిక ధరకు అమ్మేందుకు తీసుకువెళ్తూ..

నకిలీ పత్తి విత్తనాలను ఇతర ప్రాంతాల రైతులకు అధిక ధరకు అమ్మేందుకు తీసుకెళ్తున్నట్లు పోలీసులకు పట్టుపడిన శ్రీరాముల నవీన్, ఒడ్నాల రాకేశ్, మోర్ల వెంకటస్వామి అంగీకరించారు. వీటిని రేచిని గ్రామానికి చెందిన రంజిత్ కుమార్, గాండ్ల మహేశ్ వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు. నిందితులను తాండూర్ పోలీసులకు అప్పగించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.తనిఖీల్లో ఎస్సై లచ్చన్న పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబ పాలనతో తెలంగాణ ఆగం

- ఏబీవీపీ జిల్లా ప్రముఖ్ నారి వినోద్
- నగరంలో శోభాయాత్ర, బహిరంగ సభ

నిర్మల్‌చైన్‌గేట్: అనేక మంది బలిదానంతో ఏర్పడిన తెలంగాణ కేసీఆర్ కుటుంబ పాలనలో ఆగమైపోయిందని ఏబీవీపీ జిల్లా ప్రముఖ్ నారి వినోద్ కుమార్ అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నిర్మల్ జిల్లా సమ్మేళనం శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్కే కన్వెన్షన్ హాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా చింతకీరి సంతోష్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా విద్యారంగ స్థితిపై తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించారు. అనంతరం విద్యార్థులతో చేపట్టిన శోభాయాత్ర అంబేద్కర్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యా రంగం పూర్తిగా నిర్లక్ష్యంగా మారిందన్నారు. తెలంగాణ రాష్ట్రం సంక్షోభం నుంచి కోలుకుని ప్రగతి పథంలోకి నడిచేందుకు పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యా ఉపాధి అందించాలన్నారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి మనోజ్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ శివ, నగర మంత్రి సునీల్, విభాగ్ ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ శివకుమార్, విభాగ్ కన్వీనర్ గంగా ప్రసాద్, జిల్లా కన్వీనర్ శశి, జిల్లా ఎస్ఎఫ్ఐ కన్వీనర్ ప్రకాష్, నగర కార్యదర్శి జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాయకులు



బహిరంగ సభకు హాజరైన విద్యార్థులు

జాతీయ సమైక్యత, సమగ్రత సీపీఐ లక్ష్యం



మాట్లాడుతున్న కలవేన శంకర్

బెల్లంపల్లి: జాతీయ సమైక్యత, సమగ్రత లక్ష్యంగా సీపీఐ పని చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణి శంకర్ అన్నారు. శనివారం బెల్లంపల్లి సీపీఐ కార్యాలయంలో జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో ఆ పార్టీ క్రమంగా విష బీజాలు నాటే ప్ర యత్నాలు చేస్తోందన్నారు. ఆ యత్నాలను లౌకిక, ప్రజాస్వామిక శక్తులు అడ్డుకోవాలని లేకపోతే పెను సవాళ్లను చవి చూడాల్సి వస్తుందని అన్నారు. మతోన్మాదం వేళ్లానుకోకుండా కట్టడి చేయాల్సిన బాధ్యత ప్రజాస్వామిక శక్తులపై ఉందన్నారు.

ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదు

సీపీఐ పార్టీని అవహేళన చేస్తూ అభ్యంతర కరంగా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడటం తగదని సీపీఐ రాష్ట కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో సీపీఐకి వెయ్యి ఓట్లు కూడా రావని ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆసిఫాబాద్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజవ వర్గాల నుంచి పోటీ చేసి సీపీఐ అభ్యర్థి గుండా మల్లేష్ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని గుర్తు చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్, జిల్లా నాయకులు మేకల దాసు, ఎం.వెంకటస్వామి, దాగం మల్లేష్, ఎం.శ్రీనివాస్, చిప్ప నర్సయ్య, జోగుల మల్లయ్య, బియ్యాల ఉపేందర్, డీఆర్ శ్రీధర్, జీసీ మాణిక్యం, బొంతల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.